www.prajasakti.com

ప్రజాశక్తి

5

సోమవారం 1 జనవరి 2024

చిత్తూరు



జిల్లా ప్రజలకు 'నూతన సంవత్సర' శుభాకాంక్షలు

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్: జిల్లా లోని ప్రజలందరికీ రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి, ఎక్సైజ్ శాఖ మంత్రి నారాయణస్వామి, రాష్ట్ర స్త్రీ, శిశు, వికలాంగుల , వయోవృద్ధుల శాఖ మంత్రి ఉష శ్రీ చరణ్, రాష్ట్ర అటవీ విద్యుత్, పర్యావరణ,శాస్త్ర సాంకేతిక భూగర్భ గనుల శాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక , యువజనాభివృద్ధి శాఖ మంత్రి ఆర్‌కె రోజా, రాజంపేట, చిత్తూరు పార్లమెంటు సభ్యులు పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి, ఎన్ రెడ్డప్ప, జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు, కలెక్టర్ షన్మోహన్, జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డిఆర్ఓ ఎన్ రాజశేఖర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2024 నూతన ఆంగ్ల సంవత్సరంలో రాష్ట్రం, జిల్లా లోని ప్రతి ఇంటిలో, ప్రతి కుటుంబంలో ఆనందాలు, అభివృద్ధి కాంతులు వెల్లివిరియాలని, ప్రభుత్వ సంక్షేమ కార్య క్రమాల ద్వారా అర్హులైన కుటుంబాలు ఆర్థికంగా లబ్ధితో పాటు ఆర్థిక స్వావలంబన సాధించాలని కోరు కుంటున్నట్లు తెలిపారు.

కదం తొక్కుతు.. పథం పాడుతూ..

- గాంధీ విగ్రహం ఎదుట అంగన్వాడీల ధర్నా
- ఆటపాటలతో వినూత్న నిరసన





కార్వేటినగరంలో ఆట పాటలతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



పలమనేరులో ఆట పాటలతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

కొత్త సంవత్సరంలో రాష్ట్ర ముఖ్యమంత్రికి మంచి బుద్ధిని ప్రసాదించాలంటూ అంగన్వాడీలు కదం తొక్కుతు..పథం పాడుతూ ఆదివారం స్థానిక గాంధీ విగ్రహం ఎదుట ధర్నా చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమ్మె అంగన్వాడీల చేస్తున్న సమ్మె ఆదివారానికి 20వ రోజుకు చేరుకుంది. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలపట్ల స్పందించకపోవడంతో గాంధీ విగ్రహం ఎదుట ప్రభుత్వ తీరును నిరశిస్తూ నినాదాలు చేశారు. ఈసందర్భంగా సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి సురేంద్ర మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పదించకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు సృజని,



చిత్తూరులో గాంధీ విగ్రహం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

ప్రభావతిలు మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని కోరుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వంతో అనేకసార్లు యూనియన్ నేతలు చర్చలు జరిపినా జీతాలు పెంపు, గ్రాట్యూటీ అమలు వంటి విషయాలపై స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో సమ్మెను కొనసాగించాల్సి వస్తోందన్నారు. సమ్మెలో ఉన్న అంగన్వాడీలు నూతన సంవత్సర వేడుకలు దీక్షా శిబిరాల్లోనే నిర్వహించుకొని ప్రభుత్వానికి నిరసన తెలియజేస్తామన్నారు. ఈనెల 3వ తేదీన పెద్ద ఎత్తన కలెక్టరేట్ ముట్టడికి పూనుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు రమాదేవి, మణి, చిత్తూరు, గుడిపాల మండలాలకు చెందిన అంగన్వాడీలు పాల్గొన్నారు.

కార్వేటినగరం: రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలను పరిష్కారంలో నిర్లక్ష్యం వహించడంతో అంగన్వాడీలు చేస్తున్న సమ్మె 20వ రోజుకు చేరింది. ఆదివారం కార్వేటినగరం ప్రాజెక్టు ఆధ్వర్యంలో అంగన్వాడీలు ఆట పాటలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ ఏపీ అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవ అధ్యక్షులు వాడ గంగరాజు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికి ఎందుకు ఇంత రాద్ధాంతం చేస్తున్నదని ప్రశ్నించారు. ఈరోజు నుంచి సమ్మె ఉధతరూపం దాల్చుతుందని గతంలోనే హెచ్చరించినా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జగమొండి లాగా వ్యవహరిస్తుంటే అంతకంటే రెట్టింపు స్థాయిలో అంగన్వాడీలు పోరాటం చేయడంతో వారి పోరాటానికి రోజురోజు మద్దతు పెరుగుతున్నదని, చర్చలు పేరుతో దాటవేస్తూ వస్తే ప్రజా ఉద్యమంగా దాల్చుతుందని హెచ్చరించారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. జనవరి 3న కలెక్టరేట్ ముట్టడి చేస్తామని హెచ్చరించారు. యూనియన్ సిఐటియు ప్రాజెక్ట్ నాయకులు మమత, యువరాణి, హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు రాధా పాల్గొన్నారు.

పలమనేరు: మండలంలో ఐసిడిఎస్ కార్యాలయం ఆవరణంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె ఆదివారం 20 రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా అంగన్వాడీలు ఆటపాటతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి సిఐటియు నాయకులు గిరిధర్ గుప్తా అధ్యక్షతన వహించారు. అంగన్వాడీలు, సిఐటియు నాయకులు భారతి, ఏయుటిఎస్ శాంతి, ఐఎఫ్‌టియు లక్ష్మీ, చిలకమ్మ పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండల పరిధిలోని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ తమ డిమాండ్ పరిష్కరించాలని 20 రోజులుగా సమ్మె నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అంగన్వాడీలు ఆటపాటల, గొబియాలు తడుతూ నిరసన తెలిపారు. అంగన్వాడీ వర్కర్స్ నాయకురాలు శకుంతలమ్మ పాల్గొన్నారు.




బైరెడ్డిపల్లిలో

నేడు రాకెట్ ప్రయోగం..

- నింగిలోకి పిఎస్ఎల్‌వి - సి58 ద్వారా ఎక్స్‌పో శాట్
- కౌంట్ డౌన్ ప్రారంభం

ప్రజాశక్తి- సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా)



భారత అంతరిక్ష పరిశోధన సంస్థ మరోకీలక రాకెట్ ప్రయోగానికి రంగం సిద్ధం చేసింది. ఆదివారం ఉదయం పిఎస్ఎల్వి - సి58 రాకెట్‌ను ప్రయోగించడానికి శాస్త్రవేత్తలు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. తిరుపతి జిల్లా శ్రీహరికోట రాకెట్ ప్రయోగ కేంద్రంలోని మొదటి ప్రయోగ వేదికపై నుండి సోమవారం ఉదయం 9 గంటల 10 నిమిషాలకు పిఎస్ఎల్వి -సి58 రాకెట్ ద్వారా ఎక్స్ పో శాట్ అనే ఉపగ్రహాన్ని ప్రయోగించ నున్నారు. 480 కిలోల బరువు కలిగిన ఎక్స్ పో శాట్‌తో పాటు ఒక కిలో బరువు కలిగిన కేరళ యూనివర్సిటీ విద్యార్థులు తయారు చేసిన విఐవై అనే నానో ఉపగ్రహాన్ని కూడా ప్రయోగించడానికి అన్ని ఏర్పాట్లు ఇస్రో సిద్ధం చేసింది. భూమికి 650 కిలోమీటర్ల ఎత్తులోని అంతరిక్షకక్షలో తిరిగే ఎక్స్ పో శాట్ ఐదేళ్ల పాటు పనిచేస్తుంది. ఇది ప్రధానంగా ఎక్స్ కిరణాలపై అధ్యయనం కోసం జరుపుతున్న ప్రయోగం ఇది. ఈప్రయోగం భవిష్యత్తు ప్రయోగాలకు కీలకంగా ఉపయోగపడుతుంది. టెలిస్కోప్ లాగా ఉపయోగపడే ఈ ఉపగ్రహం ఎన్నో అంతరిక్ష రహస్యాలను ఛేదించబోతుందని చెప్పాలి. ఈ రాకెట్ ప్రయోగానికి సంబంధించిన 25 గంటల కౌంట్ డౌన్ ఆదివారం ఉదయం 8.10గంటలకు ప్రారంభించారు. కొత్త సంవత్సరం ప్రారంభం మొదటి రోజున రాకెట్ ప్రయోగం జరపడం పట్ల అందరి దృష్టి ప్రయోగంపై పడింది.



ఆలయం వద్ద గుమికూడిన జనం

ఇరు గ్రూపుల ఘర్షణ

- గంగమ్మ గుడిలోకి పాదరక్షలు విసిరిన వైనం
- ఆగ్రహించిన దళిత వర్గాలు
- పోలీసు స్టేషన్, అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా

ప్రజాశక్తి -పుంగనూరు

ఇరు గ్రూపుల ఘర్షణ తో గంగమ్మ గర్భగుడిలోకి పాదరక్షలు విసరడంతో ముస్లిం యువత ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఉబేదుల్లా కాంపౌండ్, ఏటిగడ్డ పాలెం పక్కపక్కనే ఉన్నాయి. ఉబేదుల్లా కాంపౌండ్ లో ముస్లింలు ఏటిగడ్డ పాలెం లో దళితులు నివాసం ఉంటున్నారు. దళితులు ఏటిగడ్డపాళ్యంలో విరాళాలతో నిధులను సేకరించి గంగమ్మ గుడిని నిర్మించుకొని నిత్యం పూజలు చేసుకుంటున్నారు. ఇటీవల టిప్పు సుల్తాన్ జెండాను గుడి వద్ద తమకు తెలియకుండానే కట్టారని వాటిని తొలగించారు. 'మేము కట్టిన జెండాను ఎందుకు తొలగిస్తారు?' అంటూ శనివారం రాత్రి ఓ గ్రూపునకు చెందిన యువత కట్టెలు, కర్రలతో దళిత వర్గాల పై దాడి చేసి గంగమ్మ గుడిలోకి పాదరక్షలు, కర్రలు విసిరారు. దీంతో సంఘటన ఉద్రిక్తతకు దారితీసింది. దీనిపై పట్టణంలో ఆగ్రహించిన కొన్ని సంఘాలు దళిత వర్గాలకు మద్దతు తెలుపుతూ పోలీస్ స్టేషన్ , అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. ధర్నా సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి దళిత మహిళలు మాట్లాడుతూ రాత్రి మా ప్రాంతంలో భయానక వాతావరణం సృష్టించిన ముస్లిం యువత ఆగడాలు చూసి భయభ్రాంతులకు గురయ్యామని ఏమి జరుగుతుందోనని తెలుసుకునే లోపే తమ పిల్లల పై దాడులు చేసి గాయాలు చేశారని, గంగమ్మ ఆలయంలోకి పాదరక్షలు, కర్రలు విసిరారని ఆరోపించారు. ఈ సంఘటనను చూస్తే యువత బరితెగించడం తీవ్రంగా ఖండిస్తున్నామని వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లేదంటే తాము కూడా వారికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఇదిలా ఉండగా పట్టణానికి చెందిన కొందరు ప్రముఖులు ఈ కేసులను రాజీపరిచేందుకు ప్రయత్నిస్తుండగా మరో గ్రూపు వారు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఇలాంటి సంఘటనలపై తీవ్రంగా ప్రతి స్పందించకుంటే పరిస్థితులు ఉద్రిక్తతతకు దారితీస్తాయని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై పోలీసులు కేసు నమోదు చేశారా? అని తెలుసుకునేందుకు ప్రయత్నించగా వారి సమాధానం దాటవేయడం, ఫోన్లు తీయడంలేదు. సంఘటనను సున్నితంగా పరిష్కరించుకుంటే పరిస్థితులు ఉద్రిక్తంగా మారే అవకాశం వుందని స్థానికులు చర్చించుకుంటున్నారు. దీనిపై స్టేషన్, అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వ హించారు.

చట్టంపై గౌరవం పెంపొందేలా మెలగాలి

- విజిబుల్ పోలీసింగ్ పెంచేలా పని చేయాలి
- వార్షిక నేర సమీక్షలో ఎస్పీ రిశాంత్ రెడ్డి

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్



కేసులపై సమీక్షిస్తున్న ఎస్‌పి రిషాంత్‌రెడ్డి

ఇప్పటి వరకు పోలీస్ అధికారులు, సిబ్బంది సహకారంతో క్లిష్టతరమైన కేసులను సైతం ఛేదించి బాధితులకు సకాలంలో న్యాయమందించామని ఇదే ఉత్సాహాన్ని కొనసాగిస్తూ 2024వ సంవత్సరంలో స్నేహపూర్వక పోలీసింగ్ ప్రజలకు అందించేలా కృషి చేయాలని జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి పోలీసులను ఆదేశించారు. సోమవారం పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో వార్షిక నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రానున్న భారత దేశ పార్లమెంటరీ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శాసనసభ సాధారణ ఎన్నికలను దష్టిలో ఉంచుకుని జిల్లాలో ఏ విధమైన అవాంచనీయ సంఘటనలు జరగకుండా జిల్లా లోని ఓటర్లు అందరు తమ ఓటు హక్కును ప్రశాంత మైన వాతావరణంలో వినియోగించుకుని రాష్ట్రానికి ఆదర్శంగా ఉండేలా రాష్ట్ర డిజిపి ఆధ్వర్యంలో పకడ్బంది ప్రణాళికలను రూపొందించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా చర్యలు తీసుకొంటున్నామన్నారు. రాబోవు ఎన్నికల దష్ట్యా ఎన్నికలను శాంతియుతంగా జరిపించేలా ప్రణాలికలను సిద్దం చేసుకోవాలని, అందరం ఇప్పటి నుండే సిద్దంగా ఉండాలని ఎన్నికలు సజావుగా సాగేందుకు గల విషయాల గురించి అధికారులకు దిశానిర్దేశం చేసారు.రాబోవు ఎన్నికలకు అందరూ సిద్దంగా ఉండాలని, రాబోవు ఎన్నికలను శాంతియుతంగా జరిపించేలా ప్రణాలికలను సిద్దం చేసుకోవాలని వివరించారు. ఎన్నికలను దష్టిలో ఉంచుకొని ప్రతి గ్రామం సందర్శించాలని ప్రతి రోజు ఒక గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలని ఇప్పటి నుండే వాహన తనికిలు ముమ్మరం చేయాలని తెలిపారు. జైలు నుండి విడుదలైన నేరస్థులపై నిఘా ఉంచాలని, వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. జైలు నుంచి బయటకు వచ్చిన వారిపై నిఘా ఉంచాలని అధికారులకు సూచించారు. పెండింగ్ లో ఉన్న గ్రేవ్-నాన్ గ్రేవ్ కేసులు, మర్డర్, డెకాయిటీ, రాబరీ, ప్రాపర్టీ, వాహనాలు దొంగతనం, 174 సిఆర్‌పిసి కేసులు, మిస్సింగ్, చీటింగ్, 102 కేసులు, సైబర్ నేరాలు, ఇతర కేసులను సమీక్షించారు. పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలు, ప్రస్తుత కేసుల స్థితిగతులు, నమోదైన కేసుల్లో నేరస్తుల అరెస్టు, కేసు దర్యాప్తు తీరుతెన్నులపై సంబంధిత పోలీస్ అధికారులతో ఆరా తీసి కేసుల ఫైల్స్, రికార్డ్స్ ను క్షుణ్ణంగా పరిశీలించారు. కేసుల ఛేదింపునకు, పరిష్కారానికి, నేర నియంత్రణకు దోహదం చేసే పలు సూచనలు మరియు మెళకువలను అధికారులకు దిశా నిర్దేశాలు చేశారు. కేసు నమోదు అయిన తర్వాత కోర్టులో నిందితులకు జైలు శిక్ష పడేవిధంగా చర్యలు తీసుకున్నప్పుడే బాధితులకు సరైన న్యాయం చేసినట్లు అవుతుందని పోలీస్ అధికారులకు సూచించారు. ఏదైనా దొంగతనం జరిగిన వెంటనే సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని, నేరస్థుడు వదిలిన సాక్ష్యాదారాలు, సిసి కెమెరాల పుటేజీలను క్రోడీకరించి ముద్దాయిలను పట్టుకొని, వారి వద్ద నుండి పూర్తిమొత్తంలో దొంగిలించిబడిన సొమ్ము రికవరీ చేయాలన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని పాటిస్తూ పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా మెలిగి వారి ఫిర్యాదులను స్వీకరించి జవాబుదారీగా ఉండాలని, మహిళలు, చిన్నారుల సంబంధిత ఫిర్యాదులపై తక్షణమే స్పదించాలని, పోలీస్ శాఖపై నమ్మకం పెంపొందించేలా సేవలు అందించాలని సూచించారు.క్రైమ్ మీటింగ్ అనంతరం ఈ సం. లో నేర చేదనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మరియు పోలీస్ వెల్ఫేర్ లో భాగంగా చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పోలీస్ ఔట్ పోస్ట్ ను త్వరిత గతిన పూర్తిచేసినందుకు గాను పోలీస్ అధికారులను, సిబ్బందిని క్యాష్ రివార్డ్స్ తో అభినందించారు.ఈ క్రైమ్ మీటింగ్ నందు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎల్.సుధాకర్, ఎస్.బి. డి.ఎస్.పి. శ్రీనివాస రెడ్డి, 3 సబ్ డివిజన్ పోలీసు అధికారులు, జిల్లా లోని అందరూ డిఎస్పీ లు, సర్కిల్ ఇన్స్పెక్టర్ లు, ఎస్ఐలు అందరూ పాల్గొన్నారు.



ఎస్ఎస్ఏ ఉద్యోగుల దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు చైతన్య

ఉద్యోగ భద్రత కల్పించాలి

12వ రోజుకు ఎస్ఎస్ఎ ఉద్యోగుల దీక్షలు

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్, బంగారుపాళ్యం: ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ సమ్మె చేపట్టిన సమగ్రశిక్షా అభియాన్ ఉద్యోగుల సమ్మె ఆదివారానికి 12వ రోజుకు చేరుకుంది. ఆదివారం కలెక్టరేట్ ఎదుట ఎస్ఎస్ఏ ఉద్యోగులు రిలే నిరాహార దీక్షలు కొన సాగిం చారు. ఎస్ఎస్ఏ ఉద్యోగుల పోరా టానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు చైతన్య మద్దతు ప్రకటించారు. ఎస్ఎస్ఏ ఉద్యోగు ల న్యాయమైన సమస్యలను ప్రభు త్వం పరిష్కరించాలన్నారు. ఎస్-ఎస్ఏ ఉద్యోగుల సంఘం జేఏసి నాయకులు శ్రీనివాస యాదవ్, లోకనాథం మాట్లాడుతూ 12 రోజులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొస్తు న్నామని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోం దని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరులో మార్పు రాకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎస్ఎస్ఏ ఉద్యోగుల పోరాటానికి ఏపిటిఎఫ్ నేతలు సంఘీభావం ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం సమగ్రశిక్షా అభియాన్ ఉద్యో గుల సమస్యలను పరిష్కరించా లన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా సమగ్రశిక్షా అభియాన్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

'సమగ్ర శిక్ష' సిబ్బంది సమ్మెకు ఆర్థిక సాయం

సమగ్ర శిక్షా అభియాన్ సిబ్బంది సమ్మెకు ఆర్థిక సహాయం అందించామని ఉపాధ్యాయ సంఘా లు తెలిపాయి. ఆదివారం చిత్తూరు కలెక్టర్ కార్యాలయం వద్ద సమగ్ర శిక్షా సిబ్బంది రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న నిరవ ధిక సమ్మెకు మద్దతుగా మండల విద్యాశాఖ తరపున ఆర్థిక సాయం అందించారు. బంగారు పాళెం మండల ఉపాధ్యాయుల ద్వారా విరాళాల రూపంలో వచ్చిన 18వేలా2 రూపాయల నగదును బంగారు పాళెం మండల విద్యా శాఖాధి కారులు నాగేశ్వర రావు రమేష్‌బాబు, ఉపాధ్యాయులు లక్ష్మీపతి, ధనంజయ రాజు, తదితరులు అందించారు.

ఏపిటిఎఫ్ మద్దతు

సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల దీక్ష కు ఎపిటిఎఫ్ జిల్లా శాఖ ఐదు వేల రూపాయల ఆర్థిక సాయం అందించింది. ఈ కార్యక్రమంలో ఏపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు గోపీనాథ్ మాట్లాడుతూ వారి న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం వెంటనే స్పందించి వాటిని తీర్చే విధంగా చర్యలు తీసుకోవాలని సమాన పనికి సమాన వేతనం, పాదయాత్రలో భాగంగా ఇచ్చిన హామీ లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ఉపాధ్యక్షులు నవీన్ కుమార్, ప్రభాకర్ , నాయకులు, వాసుదేవయ్య , మురళీకష్ణ , శంకరయ్య, అఫ్జల్ బాష, వేణు ,లక్ష్మీపతి పాల్గొన్నారు.



ఓల్డ్ ఏజ్ హోమ్‌ను తనిఖీ చేస్తున్న జడ్‌పి సీఇవో ప్రభాకర్‌రెడ్డి

ఓల్డ్ ఏజ్ హోమ్‌ను తనిఖీ చేసిన జెడ్పి సీఈవో

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: స్థానిక తపో వనం లోని 'ఓల్డ్ ఏజ్ హోంను, వికాస్ విహార్ స్కూల్ (రాస్)ను జడ్పి సిఇవో ప్రభాకర్‌రెడ్డి ఆదివా రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓల్డ్ ఏజ్ హోమ్‌లోని వృద్ధులకు కనీస వసతులను పరిశీలించి, ఓల్డ్ ఏజ్ హోమ్‌లో సౌకర్యాలు సక్రమంగా ఉన్నాయా? లేవా? పరిశీలించి, వృద్ధులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం వికాస్ విహార్ స్కూలులో విద్యార్థుల హాజరు పట్టికను, బోధనా తరగతులను, హాస్టల్‌ను, స్టోర్ రూమును, వంట గదిని, కనీస వసతులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి 'బోధన ఎలా వుంది? మీరు ఏమి నేర్చుకున్నారు?' అని ప్రశ్నించి, విద్యార్థుల నుండి సమాధానాలు రాబట్టారు.

చాట్‌బాట్ యాప్‌తో పోగోట్టుకున్న ఫోన్లు రికవరీ

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్:

పొగొట్టుకున్న, చోరీకి గురైన విలువైన సెల్‌ఫోన్నును చాట్‌బాట్ యాప్‌ద్వారా తిరిగి పొందవచ్చని జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి తెలిపారు. చిత్తూరు క్రైమ్ పోలీసులు చాట్‌బాట్ యాప్‌ను సమర్థవంతంగా సెల్‌ఫోన్సు రికవరీ చేస్తున్నట్లు చెప్పారు. చాట్‌బాట్ సేవలపై 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ..

ప్రజాశక్తి : ఇప్పటి వరకు చాట్‌బాట్ యాప్‌ద్వారా ఎన్ని సెల్‌ఫోన్సు రికవరీ చేశారు..?

ఎస్పీ: నాలుగు దశలలో సుమారు 2 కోట్ల 50 లక్షల విలువ గల 1200 ఫోన్ల రికవరీ చేశాం.. ఒక నెల సమయంలోనే 200 ఫోన్లను రికవరీ చేశాం..ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుండి రికవరి చేసి బాధితులకు అందించాం..జమ్మూ అండ్ కాశ్మీర్, రాజస్థాన్, ఢిల్లీ, కేరళ, బీహార్ వంటి రాష్ట్రాల నుండి మొబైల్ ఫోన్ల రికవరీ చేశాం.

ప్రజాశక్తి: సెల్‌ఫోన్సు రికవరీ తరువాత ఇతర రాష్ట్రాల వారికి ఎలా అందజేస్తున్నారు...?

ఎస్పీ: ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుండి కూడా ఫిర్యాదు చేస్తున్న బాధితులకు ఇతర రాష్ట్రాల నుండి చిత్తూరుకు రాని వారికి ప్రత్యేకంగా కొరియర్ ద్వారా బాధితుల ఫోన్ లను నేరుగా వారి ఇంటికి చేర్చుతున్నాం.

ప్రజాశక్తి: మొబైల్ ఫోన్ పొగొట్టుకుంటే ఇంటి నుండే ఎలా ఫిర్యాదు చేయాలి...?

ఎస్పీ: మొబైల్‌ఫోను పొగొట్టుకుంటే ఇంటినుండే చాట్‌బాట్ యాప్ ద్వారా పిర్యాదు చేసే అవకాశముంది. ఈ యాప్ ద్వారా పొగొట్టుకున్న మొబైల్ ఫోన్ ను మరల పొందవచ్చు. మొబైల్ పోగొట్టుకొన్న బాధితులు చిత్తూరు జిల్లా నుండే కాకుండా ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుండి కూడా ఫిర్యాదు వస్తున్నాయి. ఇంకా పెండింగ్ రికవరీ లు ఉన్నాయి. వాటిని కూడా త్వరలో రికవరీ చేసి భాదితులకు అందిస్తాం.



జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి

ప్రజాశక్తి: మొబైల్‌ఫోను పొగొట్టుకుంటే చాట్‌బాట్ యాప్‌లో ఎలా ఫిర్యాదు చేయాలి....?

ఇంటర్వ్యూ

ఎస్పీ: మైబ్‌లో ఫోన్ పొగొట్టుకున్న వారు ముందు 9440900004 నంబర్ వాట్సాప్‌కు హెయ్.. లేదా హెల్ఫ్ అని పంపాలి. తరువాత వెంటనే వెల్‌కమ్ టూ చిత్తూరు పోలీస్ పేరున లింకు హెయ్ లేదా హెల్ప్ అని వస్తుంది. ఈ లింకుపై గూగుల్‌ఫార్మెట్ ఓపెన్ అవుతుంది. ఆ వివరాలను పూరించాలి. జిల్లా పేరు వయసు, తండ్రిపేరు, చిరునామా, కాంట్రాక్టింగ్ నంబర్, మిస్ అయిన ప్లేస్ వివరాలను సబ్‌మిట్ చేసిన వెంటనే కంప్లైట్ లాడ్జి అవుతుంది. చాట్‌బాట్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలి.. ఫోన్ చోరీకి గురయినా..మిస్ అయినా చాట్‌బాట్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.



పుష్పరాజ్, దేవరాజులురెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న లోకేష్ నాయుడు

మాజీ సర్పంచులకు ఘన సన్మానం

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: కుప్పంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో వైసీపీకి చెందిన మాజీ సర్పంచులు పుష్పరాజ్, దేవరాజులురెడ్డి రెండు రోజుల క్రితం టిడిపిలో చేరిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మండలంలోని నెల్లెపల్లిలో ఆదివారం మాజీ సర్పంచులు పుష్పరాజ్ , దేవరాజులురెడ్డి, నెల్లేపల్లి మాజీ ఎంపిటిసి సుబ్రమణ్యంను పార్లమెంట్ టిడిపి, టిఎన్ఎస్ఎఫ్ అధికార ప్రతినిధి కేతినేని లోకేష్ నాయుడు గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ టిడిపి ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవసుందరం, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి జ్యోతిరెడ్డి, జ్యోతి శ్వరన్ పలువురు టిడిపి నేతలు, కార్యకర్తలు, పాల్గొన్నారు.



పాదయాత్ర చేపట్టిన కట్టిపోగు బసవరావుకు ఘన స్వాగతం పలుకుతున్న ఎంపిపి ఎల్లప్ప

జగన్ అభిమాని పాదయాత్ర


ప్రజాశక్తి -సదుం : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పై అభిమానంతో ఇడుపులపాయ నుండి ఇచ్చాపురం వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు మాజీ ఎస్సి కమిషన్ సభ్యుడు కట్టిపోగు బసవరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయనకు సదుంలో ఎంపిపి ఎల్లప్ప ఆధ్వర్యంలో ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వై నాట్ 175 అన్నట్లు రాబోయే 2024 సాధారణ ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అత్యధిక మెజారిటీతో విజయం సాధిస్తారని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాలకు న్యాయం చేశారన్నారు. రాబోయే ఎన్నికలలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సోదరుడు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పుంగనూరు, తంబళ్లపల్లి నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీతో గెలుస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎల్లప్ప, సింగిల్ విండో వైస్ చైర్మన్ పెద్దిరెడ్డి రమేష్ రెడ్డి, గొంగి వారి పల్లి సర్పంచ్ నారాయణరెడ్డి, దళిత నాయకులు వెంకటస్వామి మల్లేపల్లి శ్రీనివాసులు, రామచంద్రయ్య, శ్రీరాములు, చంద్ర వెంకటస్వామి నాగరాజ పాల్గొన్నారు.

పిఆర్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా రమణ



జివి రమణ

ప్రజాశక్తి -పుంగనూరు: పిఆర్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా పుంగనూరుకు చెందిన జీవీ రమణను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. విజయవాడలో జరిగిన పిఆర్‌టియు రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మూడవసారి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా జివిరమణ ఆదివారం ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ సంఘ జనరల్ సెక్రెటరీ గిరి ప్రసాద్ రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రమణ మాట్లాడుతూ మూడవసారి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా ఎన్నుకోవడంతో తనకెంతో బాధ్యత పెరిగిందని శక్తి వంచన లేకుండా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఐ ఆర్ , ప్రతినెల మొదటి తేదీన జీతం, పిఎఫ్, ఏపీ జిఎల్ఐ సి బకాయిలు, డి ఏ త్వరితగతిన మంజూరు అయ్యేటట్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ఉపాధ్యాయులకు ఎప్పటికీ రుణపడి ఉంటానని, అహర్నిశలు సేవలు చేయడానికి ముందు ఉంటానని తెలిపారు.



సమావేశంలో గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని ఎస్ఆర్ఎస్ జడ్పీ హైస్కూల్, జూనియర్ కళాశాలలో 1976-1978 సం" పదవ తరగతి, ఇంటర్మీడియట్ చదివినటువంటి పూర్వ విద్యార్థులందరూ ఒకే వేదికపై అదే కళాశాలలో ఆదివారం హాజరయ్యారు. ఆనాటి జ్ఞాపకాలు అరేయ్ ఒరేయ్, మావ బావ నాటి పిలుపులు, ఆప్యాయతల స్థానాల్లో సార్, గారు, మర్యాదల మార్పులు, అందరూ కలిసి వేదికపై వారి గురువులకు, ఉన్నత స్థానాలు అధిరోహించిన వారికి సన్మానాలు, పులమాలలతో మర్యాదలు చేశారు. పలకరింపులు, షేక్ హ్యాండ్‌లు, కౌగిలింతలు పరామర్శలు, కాలగర్భంలో జారిపోయి కరిగిపోయిన కొందరు నేస్తాల కన్నీటి జ్ఞాపకాలు, తెలియకుండానే కరిగిపోయిన కాలం, అందరి ఆత్మీయ పలకరింపుతో ఆత్మీయ సమ్మేళనం ముగిసింది.



గ్రామాల్లో పర్యటిస్తున్న ఆప్ పార్టీ నాయకులు

అవినీతి అంతం 'ఆప్'తోనే సాధ్యం

రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటాచలపతి పిలుపు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: అవినీతిరహిత పాలన ఆమ్ ఆద్మీ పార్టీతో మాత్రమే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటాచలపతి పేర్కొన్నారు. పార్టీ చేపట్టిన సామాన్యుడి శంఖారావం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ఆదివారం 4వరోజు బిఎన్ కండ్రిగ, వరదయ్యపాలెం, సత్యవేడు మండలాల్లోని వివిధ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సామాన్యులను శక్తి వంతులుగా చేయాలన్నదే తమ పార్టీ లక్ష్యం అన్నారు. డబ్బుతో ఓట్లు కొనడం తమ విధానం కాదని, ప్రజాసేవకు పెద్దపీట వేస్తామని స్పష్టం చేశారు. తాము అధికారంలోకి వస్తే ప్రజలు ఎదుర్కొనే ప్రతి సమస్యను పరిష్కరించగలమన్నారు. మండల పార్టీ కన్వీనర్‌గా బాలరాజును నియమించారు. కార్యక్రమంలో పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షులు, పార్లమెంట్ కోఆర్డినేటర్ నీరుగట్టు నగేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బొప్పన శ్రీనివాస్, జిల్లా కోశాధికారి డాక్టర్ డి.వెంకటేష్, సత్యవేడు నియోజకవర్గ కన్వీనర్ మొరుంపల్లి నందిని, వరదయ్యపాలెం మండల కన్వీనర్ సందింటి శ్రీనివాసులురెడ్డి, నియోజకవర్గ యూత్ కన్వీనర్ సూర్య పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర సతమతం

సమావేశంలో ఎన్జీఓల ఆవేదన

ప్రజాశక్తి - పలమనేరు: ఎన్‌జివోలు వృత్తి పరంగా రోజు వారీ విధుల నిర్వహణతోనే కాకుండా ఆర్థిక సమస్యలతో ఉద్యోగులు తీవ్ర ఒత్తిడిలో వున్నారని ఏపీ ఎన్జీఓ సంఘం పలమనేరు తాలూకా అధ్యక్షుడు ఆనందబాబు అన్నారు. స్థానిక ఎన్జీవో హోంలో ఆదివారం తాలూకా సంఘం కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన ఆర్థికపరమైన బకాయిలు విడుదల కాకపోవడం వల్ల ఉద్యోగుల కుటుంబాలలో ఆర్థిక సమస్యలు ఏర్పడి తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులు దాచుకున్న జిపిఎఫ్ ఏపీజి ఎల్ఐ నుండి రుణాలను కూడా ప్రభుత్వం విడుదల చేయకపోవడం వల్ల, సరెండర్ లీవులు మూడు సంవత్సరాలుగా మంజూరు కాకపోవడం, పిఆర్సి, డిఎ బకాయిలు పేరుకుపోవడం, గడువు ముగిసినా ఐఆర్ ప్రకటించక పోవడం, క్యాబినెట్ సబ్ కమిటీ సెప్టెంబర్ 30 లోపు సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా, సంవత్సరాంతం అయినా పరిష్కరించక పోవడం శోచనీయమని తెలిపారు. సంఘం కార్యదర్శి జయమ్మ మాట్లాడుతూ సిపిఎస్ రద్దు కోసం ప్రభుత్వం మేనిఫెస్టో లో ఇచ్చిన హామీని నెరవేర్చాలని పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల జీతాల నుండి మినహాయించిన సిపిఎస్ మొత్తాలను ఖాతాలలో జమ చేయక పోవడం సరికాదన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేసినందుకు ప్రభుత్వానికి ఈ సందర్భంగా సమావేశం కృతజ్ఞతలు తెలిపారు. సిపిఎస్ రద్దు హామీని నిలబెట్టుకుంటూ అసెంబ్లీలో తీర్మానం చేసిన తెలంగాణ ప్రభుత్వాన్ని సమావేశం అభినందించింది. ఈ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీపతి యాదవ్ మాట్లాడుతూ అంగన్వాడీ, సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు,ఆశా వర్కర్లు, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సంఘాలను వెంటనే చర్చలకు పిలిచి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గ్రామ వార్డు సంఘం నాయకులు హరి మాట్లాడుతూ సచివాలయం ఉద్యోగులకు జూనియర్ అసిస్టెంట్ స్కేల్ వర్తింపచేయాలని, యూనిఫామ్ రద్దు చేయడానికి ప్రభుత్వం ఉత్తర్వులు చేయాలని డిమాండ్ చేశారు. సచివాలయాల్లో పనిచేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్లు అనేక మంది ప్రాణాలు పోగొట్టుకుంటూ విదులు నిర్వహిస్తున్నందున వారి న్యాయపరమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. గ్రామవార్డు సచివాలయం ఉద్యోగుల సంఘం చిత్తూరు జిల్లా అధ్యక్షుడు రమణ మాట్లాడుతూ ఉద్యోగుల నుండి హెల్త్ స్కీమ్ కాంట్రిబ్యూషన్ ప్రతినెల మినహాయిస్తున్నప్పటికీ వైద్య సేవలు సక్రమంగా అందడం లేదని హెల్త్ కార్డులు జారీ కావడంలేదని ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అదేవిధంగా సచివాలయ ఉద్యోగులపై ఉన్నటువంటి తీవ్రమైన ఒత్తిడిని పని భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటున్న సంఘటనలు తీవ్రంగా పరిగణించాలన్నారు. రాష్ట్రంలో ఏ విభాగం ఉద్యోగులు సమ్మె చేసినా, సచివాలయ ఉద్యోగులకు ఆ భాధ్యతలు అప్పగించ ప్రయత్నించడం తగదన్నారు. అనేక విభాగాల్లో నిరంతరం శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నా అందుకు హాజరైన ఉద్యోగులకు రవాణా ఖర్చులు కూడా మంజూరు చేయడం లేదని, అదేవిధంగా బిఎల్ఓ విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు నిరంతరం ఆర్డీవో కార్యాలయానికి హాజరుకావాలని ఆదేశిస్తున్నందువల్ల సుదూర మండలాల వారికి రవాణా ఖర్చులు కూడా చెల్లించడం లేదని సమావేశం దృష్టికి తీసుకొని వచ్చారు. అనేక శాఖలలో పదోన్నతులు కల్పించకపోవడం అదేవిధంగా, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు పదోన్నతుల ఛానల్ ఏర్పాటు చేయకపోవడం పట్ల సమావేశం విచారం వ్యక్తం చేసింది. ఈ సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు సోమసుందర్ రెడ్డి, మోహన్ రామ్ ప్రసాద్, శ్రీనివాసులు, ట్రెజరర్ మొగిలప్ప, కార్యవర్గ సభ్యులు ఉషారాణి, జయ ప్రభావతి, సురేంద్ర షమీం, బిందు, వళ్లి, వేంకటాచలపతి, దాము, రాజశేఖర్, నాగేశ్వరి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌జీవోస్ సంఘం నాయకులు

డిప్యూటీ సీఎం నారాయణస్వామి గెలిపించుకుందాం: జడ్‌పిటిసి

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : గంగాధర నెల్లూరు నియోజక వర్గంలో రెడ్డి సామాజిక వర్గం, అన్ని వర్గాల వారు నారాయణ స్వామి వెంట ఉండి ఆయన గెలుపునకు కృషి చేయాలని జడ్‌పిటిసి రమణ ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఎస్ఆర్ పురం మండలం గంగమ్మ గుడి వద్ద ఎస్ఆర్ పురం మండల వైసీపీ నాయకులు విలేకరుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో రెడ్డి సామాజిక వర్గం, అన్ని వర్గాల వారు నారాయణస్వామి వెంట ఉండి ఆయన గెలుపునకు కృషి చేయాలని సూచించారు. నియోజక వర్గంలో డిప్యూటీ సీఎం నారాయణ స్వామిని అన్ని వర్గాల వారు ఐక్యంగా వుండి కలిసిమెలిసి ఆయన్ని మూడోసారి గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలిపించుకోవాలన్నారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గానికి ముచ్చటగా మూడోసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన 'జగనన్నకు థ్యాంక్యూ' అంటూ నాయకులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి గురువారెడ్డి సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు దిలీప్ రెడ్డి, కాపు సంఘ అధ్యక్షుడు విజయ బాబు, మండల కన్వీనర్ మణి, జిల్లా ఎస్సి సెల్ ప్రధాన కార్యదర్శి కుప్పయ్య, నాయకులు జనార్ధన్, కోటిరెడ్డి, బాబు, డిల్లెయ్య, మార్కొండయ్య, దాము నాయుడు, భాస్కర్ నాయుడు, బాష, జయ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్‌పిటిసి రమణ ప్రసాద్‌రెడ్డి




వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాతలు

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి -నగరి : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని నగరి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధులకు దుప్పట్లు, కేకులు, పండ్లు పంపిణీ చేశారు. ఆదివారం స్థానిక వశిష్ఠ విద్యాలయ పాఠశాల మైదానంలో ఏర్పాటుచేసిన సమావేశంలో 65 మంది వృద్ధులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ దుప్పట్లను అందించారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ డైరెక్టర్ ప్రభాకర్‌రాజు మాట్లాడుతూ నూతన సంవత్సరాలన్ని సామాజిక సేవతో స్వాగతం పలకాలన్న భావనతోనే ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఏ.మోహన్ ఉపాధ్యక్షులు డాక్టర్ మంజుల, జయరామ్ రాజు, ఎంఈఓలు హరిప్రసాద్ వర్మ, జయరామరాజు, లయన్స్ క్లబ్ సభ్యులు రాజరాజేశ్వరి, మహమ్మద్ షఫీ శక్తి వెల్ పాల్గొన్నారు.

ఉప ముఖమంత్రికి పలువురి శుభాకాంక్షలు

ప్రజాశక్తి -వెదురుకుప్పం: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామిని ఆయన నివాసంలో ఆదివారం పలువురు పుష్ప గుచ్చం అందించి ముందస్తు నూతన సంవత్సర శుభా కాంక్షలు తెలిపారు. ఆప్యాయంగా డిప్యూటీ సీఎం వారిని పలకరించారు. ఆయనను కలిసిన వారిలో వెదురు కుప్పం వైసిపీ నేత పుత్తూరు పురంధర్ రెడ్డి, పెరుమాళ్లపల్లె ఎంపీటీసీ తోకల మురళీరెడ్డి ఉన్నారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న వెదురుకుప్పం నాయకులు



డిప్యూటీ స్పీకర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కార్వేటినగరం వైసిపి నాయకులు

కార్వేటినగరం: నియోజక వర్గాన్ని అభివృద్ధి చేసిన వైసిపికి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎంపీపీ లత బాలాజీ అన్నారు. కార్వేటినగరం మండల నాయకులు ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామిని ఆదివారం కలసి ముందస్తు నూతన సంవత్సర శుభాకాక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రానున్న 2024 అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపి విజయానికి నియోజకవర్గ ప్రజలు సమిష్టిగా కృషి చేసి అఖండ విజ యాన్ని అందించాలని పిలు పు నిచ్చారు. నియోక వర్గం లో వందల కోట్ల రూపా యలతో అభివృద్ధి పనులు చేపట్టిన ఘనత డిప్యూటీ సీఎం నారాయణ స్వామికే దక్కిందన్నారు. ఆలయాలు, ఆస్పత్రులు, సీసీ రోడ్లు, గ్రామాల్లో మౌలిక వసతులతో పురాతన ఆలయాలను టీటీడీలో విలీనం చేసి పునరుజ్జీవం పోసిన ఘనత కూడా మంత్రిదే అన్నారు. సంక్షేమ పథకాలు అందిస్తున్న వైసిపిని గెలిపించి సంక్షేమ సారధి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయడానికి కలిసికట్టుగా పని చేయాలన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా ముందస్తుగా కేక్ కట్‌చేసి మంత్రికి తినిపించారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ పురంధర్ సర్పంచ్ ధనంజయవర్మ, అంకయ్య, పట్టాభిరెడ్డి, శేషాద్రి, పలువురు నాయకులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న డీఎస్పీ

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం : డీఎస్పీ

ప్రజాశక్తి-గూడూరుటౌన్: పేదవారికి స్వచ్ఛంద సేవా సంస్థలు చేస్తున్న సహాయాన్ని వారు సద్వినియోగం చేసుకొని వాళ్ళను గుర్తుంచుకోవాలని సమాజంలో ప్రతి ఒక్కరు సత్ప్రవర్తనతో మెలగాలని గూడూరు డిఎస్పి సూర్యనారాయణ రెడ్డి వెల్లడించారు. పట్టణ సమీపంలోని చవటపాలెంలో నూతన సంవత్సరం సందర్భంగా ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్ వీల్‌క్లబ్ ఆధ్వర్యంలో ముఖ్యఅతిధిగా విచ్చేసిన డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కేక్‌కట్ చేసి అందించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్ వీల్ క్లబ్ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సమాజంలో సత్ప్రవర్తనతో ఉంటూ మంచి పేరు పొందాలని తెలిపారు. ఇటీవల కాలంలో ఎక్కువమంది మత్తు పదార్థాలకు బానిసలు అవుతున్నారని సంఘవిద్రహశక్తులుగా మారుతున్నారని అటువంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. క్లబ్ గౌరవాధ్యక్షురాలు డాక్టర్ రోహిణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నేటి పరిస్థితుల్లో ఆరోగ్య సంరక్షణ చూసుకోవాలని మంచి ఆహారాన్ని తీసుకోవాలని కోరారు. చిన్నతనం నుండి జంక్ ఫుడ్‌లు తినే చిన్న వయసులోనే ఆరోగ్య సమస్యలతో ఎక్కువ మంది హాస్పిటల్‌కి వస్తున్నారని తల్లిదండ్రులు మంచి ఆహారాన్ని ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో విష్ణువందన, స్నేహలతరెడ్డి, శశిరేఖ, రత్నం తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నగరి మండల అధ్యక్షులుగా సుదర్శననాయుడు

ప్రజాశక్తి - నగరి : వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మండల కమిటీని ఎన్నుకున్నారు. నగరి మండల అధ్యక్షులుగా సుదర్శన నాయుడు నియమితులు కాగా ఉపాధ్యక్షులుగా ఏయుమలై రెడ్డి, మాబూనిషా, ప్రధాన కార్యదర్శులుగా ఎన్.సంజీవరెడ్డి, నాగవేలు, కేఈ రవి, ఎస్.వేలు, కార్యదర్శులుగా జయకుమార్, హరినాయుడు, రామూర్తి, కిరణ్, శ్రీనివాసులు రెడ్డి, సురేష్, ఎస్. రామ చంద్రారెడ్డి, ఎం.శశికుమార్, సహకార్యదర్శులుగా కె.మదు, సత్య, మురగయ్య, ఆనందయాదవ్, టి.మునీంద్ర, గుణశేఖర్, హరిరెడ్డి, శేఖర్‌లను ఎన్నుకున్నారు. ఈమేరకు వారికి పార్టీ అధిష్టానం నుంచి ఉత్తర్వులు అందింది. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమకు ఇచ్చింది పదవిగా భావించడం లేదని బాధ్యతగా భావిస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు సాయశక్తులా కృషిచేస్తామన్నారు. పదవులు అందించిన జగనన్నకు, సహక రించిన మంత్రి ఆర్కేరోజాకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు.



సుదర్శననాయుడు

నూతన సంవత్సర వేడుకలకు ఆలయాలు ముస్తాబు

ప్రజాశక్తి-నగరి : నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని ఆలయాలు ముస్తాబవుతున్నాయి. స్థానిక కరియ మాణిక్య స్వామి ఆలయంలో చలువ పందిళ్లు ఏర్పాటుచేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. పుష్పాలంకరణ పనులు ప్రారంభించారు. రాజీవ్‌నగర్ గుట్టపై వెలసిన సాయి దివ్యధామంలో నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. కరకంఠేశ్వర స్వామి ఆలయంలోను, బుగ్గ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలోను ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణ పరిధిలోని దుకాణాల వెలుపల నూతన సంవత్సర క్యాలెండర్లు, 2024తో సిద్ధమైన అలంకరణ వస్తువులు దర్శన మిచ్చాయి. మండలంలోని నంబాకం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు స్థానికంగా ఉన్న విద్యార్థులను పాఠశాలకు రప్పించి నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో రంగులతోను, పుష్పాలతోను వేసిన ముగ్గు పలువురిని అలరించింది. నూతన సంవత్సరాన్ని వారి వారికి నచ్చిన రీతిలో జనం స్వాగతం పలుకుతున్నారు. దేశమ్మ దేవాలయ సమీపం ఉన్న ఒక హోటల్‌లో వంట మాస్టర్ తనదైన శైలిలో హ్యాపీ న్యూఇయర్ 2024 అంటూ దోశ వేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



యోధుల ఆశయబాటలో ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-క్యాంపస్ (తిరుపతి) స్వాతంత్ర యోధులు కలలుకన్న స్వరాజ్యం, సోషలిజం బాటలో ఎస్ఎఫ్ఐ నడుస్తూ అందరికీ విద్యా, ఉపాధి, సమాన అవకాశాలు కోసం ప్రయాణిస్తూ 54వ సంవత్సరములోకి ఎస్ఎఫ్ఐ నడుస్తుంది అని తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి భగత్ రవి అన్నారు. ఎస్ఎఫ్ఐ 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎస్వి యూనివర్సిటీలో ప్రకాశం భవన్ ముందు ఎస్ఎఫ్ఐ జెండా ఆవిష్కరణ జిల్లా అధ్యక్షులు అక్బర్ ఆవిష్కరణ చేశారు. ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర నాయకులు నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాను కాపాడుకునేందుకు దేశం అంతటా అలుపెరుగని పోరాటం చేస్తున్న సంఘామ్ ఎస్ఎఫ్ఐ అని అన్నారు. దేశంలో, రాష్టంలో భారత రాజ్యాంగం పరిరక్షణకై, అందరికీ విద్యా కోసం పోరాడుతూ ప్రతిష్ఠత్మక విశ్వావిద్యాలయాలలో ఎస్ఎఫ్ఐ గెలుస్తు పతాకం ఎగురుతుందని ఎయిడెడ్ విద్యా సంస్థల కొనసాగాలని రాష్ట్రంలో పెద్ద ఎత్తున పోరాడింది ఎస్ఎఫ్ఐ అని అన్నారు. విద్యార్థుల హక్కులు కోసం, సమస్యలుపై మరింత పోరాటాలు చేయాలని వారు పిలుపునిచ్చారు. అదే విదంగా ఎస్వి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ జెండా ఆవిష్కరణ జిల్లా నాయకులు పవన్ ఆవిష్కరణ చేశారు. స్వాతంత్ర్యం, ప్రజా స్వామ్యం, సోషలిజం కోసం ఎస్ఎఫ్ఐ అధ్యయనం, పోరాటం నినాదాలతో విద్యా, వైద్యం, ఉపాధి కోసం పోరాడుతుందని వారు అన్నారు. కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ ఎస్వీయూ అధ్యక్షులు నరేంద్ర, వినోద్, నాయకులు వీరేష్, శివ అబ్బాస్, కిరణ్, సిటీ నాయకులు పురుషోతం, సతీష్, ప్రశాంత్, కిశోర్ పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆసనాల బోర్డులు ఏర్పాటు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : కొత్త ఏడాదిలో.. సరికొత్త ఆలోచనలతో నగర ప్రజల కోసం కట్టమంచి చెరువు కట్టపై ఉన్న వాకింగ్ ట్రాక్ లో సూర్య నమస్కారాల్లోని మొత్తం 12 ఆసనాలకు సంబంధించిన బోర్డులను కమిషనర్ డా. జె అరుణ ఏర్పాటు చేశారు. మంచి ఆరోగ్యానికి ఇవి ఎంతగానో దోహదపడతాయని వీలును బట్టి ఈ ఆసనాలను అందరూ సులభంగా వేయవచ్చని తెలిపారు. చెరువు కట్ట సుందరీకరణ పనుల్లో అవగాహన పెంచడం కోసం... మొత్తం 12 ఆసనాల చిత్రాలు.. ఆసనాల వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేస్తూ బోర్డులను ఏర్పాటు చేయించారు. కొత్త సంవత్సరంలో ఒక కొత్త ఆలోచనతో చేపట్టిన ఈ కార్యక్రమంపై నగరవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



విద్యార్థికి బహుమతి అందిస్తున్న ప్రిన్సిపాల్ ఎపి లలిత

పోటీ పరీక్షలో విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి -యాదమరి: అపోలో టోటల్ హెల్త్ సౌజన్యంతో నిర్వహించిన డెటాల్ హైజిన్ ఒలంపియడ్ లో యాదన్య ప్రతిభ కనబరిచాడు. ప్రతిభ పరీక్ష లో కె.గొల్లపల్లె హైస్కూల్ 6వ తరగతి విద్యార్థి యాదన్య లెవల్ 3లో ప్రథమ బహుమతి సంపాదించి ,5వేల రూపాయలు, షీల్డ్, ప్రశంసా పత్రం సాధించిందని ప్రిన్సిపాల్ ఎపిలలిత తెలిపారు. ఈప్రతిభ పరీక్షలు 17మండలల్లో 38,541 మంది పాల్గొన్నారు. ఈపరీక్షలు నాలుగు లెవెల్ లో జరిగింది. విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

ముగిసిన బాలికల కబడ్డీ జట్టు కోచింగ్ శిబిరం

ప్రజాశక్తి -చౌడేపల్లి: స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలోని ఇండోర్ స్టేడియంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అండర్ 17 బాలికల జట్టు కోచింగ్ శిబిరం విజయవంతంగా ముగిసింది. రాజస్థాన్ రాజధాని జైపూర్ లో జనవరి 3 నుంచి 8వ తేదీ వరకు జాతీయ స్థాయిలో జరిగే కబడ్డీ పోటీల్లో మన రాష్ట్ర జట్టు తలపడుతుందని పీడీ వెంకటేశ్వర్లు రాజేంద్రబాబులు తెలిపారు. నాలుగు రోజులపాటు జరిగిన కోచింగ్ శిబిరం నిర్వహణకు భోజన వసతి క్రీడాకారిణులకు సమ దుస్తులకు పంపిణీ చేసిన రాష్ట్ర యువ నాయకుడు, అధ్యక్షుడు మిద్దింటి కిషోర్ పిల్లారి ఏజెన్సీస్ పిల్లారి జీవన్ ప్రకాష్ జిల్లా ప్రైవేటు పిఈటిల సంఘ కార్యదర్శి లీలా కుమార్ నాగ్ సర్పంచ్ శ్రీరాం భరత్ వరుణ్ గడియాల మహేష్ బాబు లకు ప్రధానోపాధ్యాయులు నాగరాజు రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



మాట్లాడుతున్న నాయకులు

7న శ్రీకృష్ణదేవరాయ విగ్రహ మహోత్సవం

ప్రజాశక్తి- చౌడేపల్లి: పుంగనూరు భీమ గాని పల్లి బైపాస్ రోడ్డులో ఏర్పాటుచేసిన శ్రీకృష్ణదేవరాయ కాంస్య విగ్రహ మహోత్సవం ఈ నెల 7వ తేదీ నిర్వహిస్తామని అందరూ తరలి రావాలని పలువురు పిలుపు నిచ్చారు ఆదివారం స్థానిక గంగమ్మ వివాహ వేదిక భవనంలో ఏర్పాటు చేసిన సభలో నాయకులు ప్రసంగిస్తూ ఈ నెల 7న పుంగనూరు బైపాస్ లో రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా శ్రీకృష్ణదేవరాయల కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. టిటిడి బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్ కుమార్ రాష్ట్ర సాంస్కృతిక కళల ఛైర్మన్ కొండవీటి నాగభూషణం ,ఎంపీపీ గాజుల రామ్మూర్తి, పుంగనూరు పరిశీలకుడు జింకా చలపతి, బోయకొండ ధర్మకర్తల మండలి సభ్యుడు పవన్ రాయల్, మాజీ మండలాధ్యక్షుడు శ్రీరాం రెడ్డి ప్రకాష్, బోయకొండ మాజీ ఛైర్మన్, మిద్దింటి శంకరనారాయణ, హెచ్ డి ఎస్ ఛైర్మన్ కళ్యాణ్ భరత్, వైసిపి యువజన నేత హరీష్ రాయల్, సర్పంచ్ శ్రీరామ్ భరత వరుణ్, శ్రీరామ్, అరుణ్ రాయల్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్

'విద్యార్థులకు సాఫ్ట్ స్కిల్స్ అవసరం'

ప్రజాశక్తి-క్యాంపస్(తిరుపతి): విద్యార్థులకు సాఫ్ట్ స్కిల్స్‌పై అవగాహన పెంచుకోవాలని రిమ్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.ప్రకాష్ రెడ్డి అన్నారు. ఆదివారం రిమ్స్ కళాశాలలో ఎంసీఏ, ఎంబీఏ, ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, కెరీర్ గైడెన్స్‌పై ఏడు రోజుల ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రిన్సిపల్ మాట్లా డుతూ విద్యార్థులకు సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై ప్రత్యేకమైన నిష్ణాతులైన అధ్యాపకులు చేత శిక్షణ కార్యక్రమాలను ప్రతి సంవత్సరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. చివరి సంవత్సరం విద్యార్థులకు సాఫ్ట్వేర్ ఉద్యోగాలు, ఇతర ఉద్యోగాలలో అన్ని రకాల నైపుణ్యాలపై శిక్షణ అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కోర్సు చివరి సంవత్సరం విద్యార్థులకు మార్చి నెలలో కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తా మన్నారు. విద్యార్థులకు మ్యాజిక్ బస్సు ఇండియా ఫౌం డేషన్ ఏపీ మే నేజర్ మోహన్, చిత్తూరు జిల్లా ప్లేస్మెంట్ ఆఫీసర్ వెంకటప్రసాద్, ట్రైని ంగ్ ఆఫీసర్లు గురుసాయి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. సదస్సులో కళాశాల చైర్మన్ కొండారెడ్డి, డైరెక్టర్లు ఆనందరెడ్డి, విజయరెడ్డి, విభాగాధిపతులు నిరంజన్‌రెడ్డి అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.